సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేయాలి


సమావేశంలో ఉస్మాన్ అలీ, వినోద్ చౌగ్లె, రూప్‌లాల్

జియాగూడ: సంక్షేమ పథకాలు సక్రమంగా అందే విధంగా డివిజన్ల కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ అలీ, జియాగూడ ఇన్‌చార్జి వినోద్ చౌగ్లేలు అన్నారు. ఈ మేరకు జియాగూడలోని లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి రూప్‌లాల్ మక్కన్ నివాసంలో ఏర్పాటైన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు ఎంత మేరకు అందాయి, ఇంకా ఎంత మందికి అందాలి లాంటివి ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల కార్యకర్తలు సమాచారం సేకరించి ఏరియా వార్డు కార్యాలయాలలో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జియాగూడ అధ్యక్షుడు పి.దర్శన్, వర్కింగ్ అధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ ముదిరాజ్, సహా కార్యదర్శి మహేశ్‌బాబు, వనిత, పునీత పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటీకరణ చేయాల్సిన అవసరం లేదు



మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్ నాయక్

నాంపల్లి: బీఎస్ఎన్ఎల్ నష్టాల బాటలో లేదని, సంస్థను ప్రైవేటీకరణ చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక వ్యవస్థను రూపకల్పన చేసి దానికి నిధులను సమకూర్చుతుందే తప్ప నడిపించదనే విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తుంచుకోవాలన్నారు. ఇటీవల బీఎస్ఎన్ఎల్ క్యాడర్ ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ ఎస్టీ కమిషన్(ఎన్‌సీఎస్‌టీ)కు ఫిర్యాదులు అందాయి. వివిధ ట్రేడ్ యూనియన్లు చేసిన ఫిర్యాదుల మేరకు ఆయన విచారణ నిమిత్తం రాష్ట్రానికి విచ్చేశారు. సోమవారం నాంపల్లి స్టేషన్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ సమావేశ మందిరంలో సీజీఎం, ఇతర అధికారులతో ఆయన రివ్యూ మీటింగ్‌ను నిర్వహించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, అధికారులు తమ గోడును వెల్లబోసుకున్నారు. బీఎస్ఎన్ఎల్‌లో జరుగుతున్న అన్యాయాలు, అధికారుల వేధింపులను ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. గడచిన ఎనిమిదేళ్లుగా బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగాల భర్తీ జరగలేదని అన్నారు. ఈ సంస్థను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సీఎండీ, సీజీఎంలదే అన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం రత్నకుమార్‌తో పాటుగా పలువురు ట్రేడ్ యూనియన్ నేతలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన తెలంగాణ క్రీడాకారులు



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఎం.కె.శ్రీబాలాజీ

జియాగూడ: న్యూ ఢిల్లీలోని గౌతమ్‌బుద్ధా యూనివర్సిటీలో 32వ ఏఐకేఎఫ్ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్–2024 పోటీలకు గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో తెలంగాణలోని పలు స్కూల్స్, కాలేజీలకు చెందిన 11 మంది క్రీడాకారులు 14 మెడల్స్ సిల్వర్, కాంస్య పతకాలను సాధించినట్లు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఎం.కె.శ్రీ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ..కరాటేపై విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారని, ఆత్మరక్షణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పోటీల్లో జియాగూడకు చెందిన విద్యాశ్రీ హై స్కూల్ విద్యార్థి సిద్ధార్థ్, రిలయన్స్ స్కూల్, విమల్ రాజ్ శ్రీ సాయి టాలెంట్ స్కూల్, రవిసాగర్ నాంపల్లి డైమండ్ జూబ్లీ స్కూల్ నేహా, యాషిక, తనిష, జీసీపీ కాలేజీ సుమిత్, ఉస్మానియా యూనివర్సిటీ నిఖిల్‌లు సాధించినట్లు తెలిపారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం పంపిణీ


అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న అయ్యప్ప స్వాములు కాట రమేష్, చలువాది శ్రీకాంత్

చార్మినార్: దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు సోమవారం నుంచి అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా కొంతమంది అయ్యప్ప స్వాములు భిక్ష తయారీ కోసం సమయం దొరకని వారి సౌకర్యార్థం తాము వచ్చే నెల 8 తేదీ వరకు ప్రతిరోజు ఉదయం ఉచితంగా అన్న ప్రసాదాన్ని అందజేస్తున్నమన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కాటా రమేష్, చలువాది శ్రీకాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి వేడుకలు

అబిడ్స్: పోలి పాడ్యమి–పోలి స్వర్గం వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీకమాసం ముగింపు సందర్భంగా గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర శివాలయంలో సోమవారం తెల్లవారుజామున మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలంతా గంగా జలాల్లో దీపాలను వదిలి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేందర్, ఉపాధ్యక్షుడు గిరిధర్‌ల ఆధ్వర్యంలో భక్తులకు భారీ ఏర్పాట్లు చేపట్టారు.



అలరించిన కళాకారుల ప్రదర్శనలు



గోల్కొండ: తిరుపతి పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నగరానికి చెందిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఆసిఫ్‌నగర్, ఆగాపూరాకు చెందిన కళాకారులు చక్కటి ప్రదర్శనలు ఇచ్చారు. గోండు, కొమ్ము, కోయ నృత్యాలతో అందరిని ఆకట్టుకున్నారు. సోమవారం తిరుచినూరు మాడ వీధుల్లో రెండు బృందాలకు చెందిన 50 మంది కళాకారులు నృత్యాలు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. విఘ్నేశ్వర ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు సుక్క గణేష్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు జరిగాయి.

అవినీతి అధికారులకు కఠిన శిక్షలు విధించాలి


ఆళ్ల రామకృష్ణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలోని అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ ఉక్కుపాదం మోపుతూ..వరస దాడులు, అరెస్టులతో అవినీతి అధికారులు గుండెల్లో వణుకు పుట్టిస్తుందని ఓబీసీ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు ఆల్ల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం సైఫాబాద్‌లోని పరిరక్షణ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అవినీతి ఏరులై పారిందని మండిపడ్డారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ పేరుతో అప్పుల తెలంగాణగా మార్చారని ధ్వజమెత్తారు. నీటి పారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ నిఖిలేష్, హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ వంటి పలువురు అధికారులపై ఏసీబీ నిర్వహించిన దాడులలో రూ.100 కోట్ల అక్రమ సంపాదన బయటపడిందని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని, దీంతో రోజుకు పదులు సంఖ్యలో అవినీతి అధికారులపై కేసులు నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు.

చిరువ్యాపారులను ఆదుకోవాలి


బల్దియా అధికారులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: చిరువ్యాపారులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం బల్దియా డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, యూసీడీ అధికారి లలితకుమారితో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వివిధ పొదుపు సంఘాల గ్రూప్ లీడర్లకు, తోపుడు బండ్లు, చిరువ్యాపారులకు అవగాహన కల్పించేందుకు వారికి మంజూరైన చెక్కులను ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తోపుడు బండ్ల వ్యాపారులకు రెక్కాడితేగానీ డొక్కాడని అటువంటి వారికి బ్యాంకులు గానీ వేరు ఇతర ఆర్థిక సంస్థలు రుణాలు ఇవ్వవని ఆయన అన్నారు. బల్దియా యూసీడీ విభాగం అధికారులు ఇటువంటి వారిని గుర్తించి వారికి అండగా నిలవాలని ఆయన అన్నారు. అంతేకాకుండా పొదుపు సంఘాల ఏర్పాటుకు ప్రతి డివిజన్‌లో యూసీడీ విభాగం సిబ్బంది పర్యటించి మహిళలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూసీడీ అధికారిణి లలితకుమారి తదితరులున్నారు.

ఎనీ టైమ్.. ఎనీ బ్రాండ్!

- పాతబస్తీలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- విచ్చలవిడిగా బెల్ట్ షాపులు
- అర్ధరాత్రి విక్రయాలతో బెంబేలెత్తుతున్న స్థానికులు
- పట్టించుకోని ఆబ్కారీ అధికారులు



చార్మినార్: రాత్రి..అర్ధరాత్రి..తెల్లవారుజాము..ఇలా ఎప్పుడు పడితే అప్పుడు కావాల్సిన మందు కోసం ఎదురుచూస్తున్న మందుబాబులకు పాతబస్తీ అడ్డాగా మారింది. వైన్ షాపులు, బార్లు నిర్దేశించిన సమయం ప్రకారం రాత్రి సమయంలో మూసివేస్తుండడంతో.. అర్ధరాత్రి మందు కావాలనుకున్న వారికి బెల్ట్ షాపులు సేవలను అందజేస్తున్నాయి. పాత బస్తీలోని కొన్ని ప్రాంతాల్లో ఈ బెల్ట్ షాపులు యథేచ్ఛగా పనిచేస్తున్నాయి. ఏ ఏ షాపులు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయో మందు బాబులకు ఇట్టే తెలిసిపోతుంది.

పట్టించుకోని సంబంధిత పోలీసులు..

కొన్నేళ్లుగా అక్రమ మద్యం దుకాణాలు పాతబస్తీలో మందుబాబులకు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయాలు సంబంధిత ఎక్సైజ్ పోలీసులతో పాటు స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసులకు కూడా తెలిసినప్పటికీ అటువైపు కన్నెత్తి చూడక పోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

భయాందోళనలో స్థానికులు..

అర్ధరాత్రి తమ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తిరగబడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆయా మద్యం దుకాణాల యాజమాన్యమే ఈ ఈ బెల్ట్ షాపులతో వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిర్దేశించిన ఎంఆర్‌పీ రేట్ల కన్నా అధికంగా ముట్టచెబితే ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ దొరుకుతుందని మందుబాబులు చెప్తున్నారు. వైన్ షాపులు, బార్లు మూసిన అనంతరం తమకు మద్యం దొరుకుతుంది.. అదే చాలు..ఇక రేటుదేముంది..? అని అంటున్నారు మందుబాబులు. అక్రమ మద్యం విక్రయాలను వెంటనే అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు..

పాతబస్తీలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను వెంటనే మూయించి స్థానికులకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని పేర్కొంటూ ఇప్పటికే పలువురు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. ఇటీవల చార్మినార్‌కు చెందిన ఓ నాయకుడు అస్మత్ అలీ పాతబస్తీలోని బెల్ట్ షాపులపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి దాటిన అనంతరం తెల్లవారుజాము వరకు పాతబస్తీలో కొనసాగుతున్న అక్రమ మద్యం విక్రయాలను వెంటనే అరికట్టాలని అతను తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: 2024–25 సంవత్సరానికి గాను ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో స్టాటిస్టిక్స్ విభాగంలో తాత్కాలిక అతిథి అధ్యాపక నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తు, అర్హతల ఒరిజినల్స్, ధ్రువీకరణ పత్రాలతో డిసెంబర్ 4వ తేదీ సంబంధిత శాఖలో ఇంటర్వ్యూకి హాజరుకావాలని ఆయన కోరారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, పీహెచ్‌డీ, ఎం.ఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభావం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఇతర వివరాలకు డి.శ్రవణ్ కుమార్ (98482 74530)ని సంప్రదించాలన్నారు.

విజయోత్సవాలకు భారీ ఏర్పాట్లు


వెంకటేష్ మేరు


చార్మినార్: ఏడాది పాలన విజయోత్సవాలను విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చార్మినార్ శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్ వెంకటేష్ మేరు అన్నారు. తమ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కుల మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. ఇది గిట్టని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అడ్డదిడ్డమైన ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారానికి పాల్పడటం సరైనది కాదన్నారు.

చలికి గుర్తుతెలియని వ్యక్తి మృతి



లంగర్‌హౌస్: చలి తీవ్రతకు తట్టుకోలేక గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 38 ఏళ్ల వయస్సు గల వ్యక్తి తలకు గాయంతో కట్టు కట్టించుకొని ఆదివారం సాయంత్రం బాపూఘాట్ వద్ద తిరిగాడు. రాత్రి కురిసిన వర్షానికి అలాగే తడుస్తూ, చలికి తట్టుకోలేక పడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకొని పరీక్షించగా అతను అప్పటికే మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

చార్మినార్ బీఆర్ఎస్ ఇన్‌చార్జిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న పుప్పాల రాధాకృష్ణ

చార్మినార్: ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన దీక్ష దివస్ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోదీ పాల్గొనకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని..అతనిపై పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పాతబస్తీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మొఘల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పుప్పాల రాధాకృష్ణ, మణికొండ విజయ్ కుమార్, తిరుపతి నాగరాజ్, మహమ్మద్ అమీర్, పంకజ్ షిండే తదితరులు పాల్గొని నియోజకవర్గ ఇన్‌చార్జికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చార్మినార్ నియోజకవర్గం నుంచి సలావుద్దీన్ లోదీ ఆధ్వర్యంలో ఎలాంటి ర్యాలీ కానీ..కార్యకర్తల తరలింపు గానీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.

మాధవ వెంకట కృష్ణ రచనల ఆవిష్కరణ


రచయిత మాధవ వెంకటకృష్ణ దంపతులకు అవార్డును అందజేస్తున్న లయన్ కేవీ. రమణరావు

గన్‌ఫౌండ్రీ: మాధవ్ మ్యూజిక్ స్టూడియో ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత మాధవ వెంకట కృష్ణ రచించిన షిరిడీ సాయి జ్ఞాన యజ్ఞం, నాలో నేను పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని, అలాగే మారుతున్న కాలానికి అనుగుణంగా చోటు చేసుకున్న పరిణామాలను నిశిత దృష్టితో అధ్యయనం చేయడం రచయితకు ఉండాల్సిన ప్రధాన లక్షణమన్నారు. 108 వారాల పాటు 108 పాటల వీడియోలను పొందుపరిచినందుకుగాను రచయిత మాధవ వెంకట కృష్ణకు ఇండియా ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సెల్ బుక్ఆఫ్ రికార్డ్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, రైటర్స్ అండ్ పోయేట్ బుక్ఆఫ్ వరల్డ్ రికార్డ్ అను నాలుగు ప్రపంచ రికార్డ్‌లను సంబంధిత ప్రతినిధి లయన్ కేవీ రమణారావు రచయితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, జస్టిస్ హేమంత్‌కుమార్, ఆత్మకూరి రామకృష్ణ, బడే ప్రభాకర్, ఓంప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజావాణిలో జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: ప్రజావాణిలో తమకు అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. సోమవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ..ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చెప్పట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, వెటిర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కావ్య ప్రియకు సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డు–2024


కావ్య ప్రియకు అవార్డు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


యాకుత్‌పురా: వైద్య రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న నగరానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ కావ్య ప్రియ వజ్రాలకు సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డు–2024 లభించింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బంజారాహిల్స్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నగరంలో నిర్వహించిన 4వ వార్షిక ఐఎంఏ ఇంఫాక్ట్ కన్–2024 అవార్డు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ డాక్టర్ కావ్య ప్రియకు అవార్డును అందజేశారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ విభాగంలో గర్భిణులకు అందిస్తున్న అత్యుత్తమ వైద్య సేవలకు గాను ఆమెకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తన సేవలను గుర్తించి అవార్డు అందజేసిన గవర్నర్‌తో పాటు ఐఎంఏ బ్రాంచ్ వ్యవస్థపక అధ్యక్షుడు డాక్టర్ చల్లగలి ప్రభు కుమార్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రసన్న కిరణ్‌కు సత్కారం


ప్రసన్న కిరణ్‌ను సత్కరిస్తున్న విద్యావేత్త సూరేపల్లి రవికుమార్, అమృత్‌కుమార్ జైన్

అబిడ్స్: ప్రముఖ కవయిత్రి, రచయిత బీదా ప్రసన్న కిరణ్‌ను వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సామాజిక, సాంఘిక రంగాలతో పాటు ప్రకృతి, మహిళా రంగాలపై విశేషంగా ఆకట్టుకునే విధంగా తమ కవితలను భావ వ్యక్తీకరణతో రచనలు చేస్తున్న ఆమెను ప్రముఖ విద్యావేత్త సూరేపల్లి రవికుమార్, సంఘసేవకుడు అమృత్‌కుమార్ జైన్ ఘనంగా సత్కరించి ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రసన్న కిరణ్ మాట్లాడుతూ..చక్కని భావ వ్యక్తీకరణతో సమాజంలో అందరికీ ఉపయోగ పడే విధంగా విలువైన రచనలు, కవితలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ పాలనలో అందరికీ న్యాయం


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ పాలనలో అందరికీ న్యాయం జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం నాయకుడు కురాకుల కృష్ణ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎరుకల సోదరులకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ..ఎరుకల ఫైనాన్స్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసి దానికి ప్రత్యేకంగా కమిటీ వేస్తామన్నారు. ఏదేమైనా అన్ని వర్గాల వారికి పార్టీలో సముచిత స్థానం ఇస్తామన్నారు.

ఆకట్టుకున్న భక్తి కీర్తనలు



నాంపల్లి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుచానూరు అమ్మవారి ఆలయంలో జరిగిన వేడుకల్లో మహతి ఆర్ట్స్ హైదరాబాద్ వారికి సంగీత కచేరిని ప్రదర్శించే అవకాశం లభించింది. గురువు వింజమూరి లక్ష్మీ బృందం హాజరై అమ్మవారి సన్నిధిలో కీర్తనలను ఆలపించారు. అన్నమయ్య, తాగరాజ కృతులతో ఆలపించి అమ్మవారి భక్తులను తన్మయత్వంలో ముంచెత్తారు. ఈ అవకాశం రావడం పూర్వజన్మ సుకృత ఫలమని మహతి ఆర్ట్స్ నిర్వాహకులు తెలిపారు.

జిమ్రిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ


వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

అఫ్జల్‌గంజ్: జిమ్రిస్ గ్రూఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు కోర్సులలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంప్లాయిమెంట్ ఉద్యోగ అవకాశాలతో పాటు నిరుద్యోగులకు కూడా ఉపయోగపడే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆటో క్యాడ్, ఎంఎస్ ఆఫీస్, పవర్‌పాయింట్, ఎక్సెల్, ఫొటోషాప్, అకౌంటింగ్, ఇంటీజ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఫ్రంట్ ఆఫీస్ సెక్రెటరీ, ఇతర పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. వివరాలకు 92916 82731, 86866 28372లలో సంప్రదించాలన్నారు.

సన్మానం


మహ్మద్ అబ్దుల్ మోయిజ్‌ను సన్మానిస్తున్న చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఎండీ కే.వేణుగోపాల్ రావు

యాకుత్‌పురా: విధి నిర్వహణలో మోయిజ్ అందించిన సేవలు అభినందనీయమని ప్రభుత్వరంగా సెట్విన్ శిక్షణ సంస్థ చైర్మన్ గిరిధర్ రెడ్డి అన్నారు. పురానీహవేలీలోని సెట్విన్ ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అబ్దుల్ మోయిజ్ పదవీ విరమణ సందర్భంగా సోమవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఎండీ కే.వేణుగోపాల్ రావు పాల్గొన్నారు. మోయిజ్‌ను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ అధికారి సురేష్ బాబు, సూపరింటెండెంట్ రాధాకృష్ణ, ఉద్యోగులు నవీన్ కుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆసుపత్రి కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాల్లో కోతలు వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆసుపత్రిలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాల్లో కోతలు పెట్టొద్దని భారతీయ మాజ్దూర్ సంఘ్ కార్య నిర్వహక కార్యదర్శి శంకర్ అన్నారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులతో సమావేశమయ్యారు. కార్మికులు తమ జీతాల్లో రెండు, మూడు వేల చొప్పున కోతలు విధిస్తున్నారని, సకాలంలో జీతాలు చెల్లించడం లేదని ఆయనకు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిలో సుమారు 900 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ఉస్మానియా యూనిట్ కార్యనిర్వహక అధ్యక్షుడు గొల్లపల్లి అనిల్‌కుమార్, నాయకులు మహేష్, జీపీ కృష్ణసాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఫ్లైఓవర్ బ్రిడ్జిగా నామకరణం చేయాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పులిపాటి రాజేష్‌కుమార్

చార్మినార్: జూ పార్క్–ఆరాంఘర్ ఫ్లైఓవర్‌కు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఫ్లైఓవర్ బ్రిడ్జిగా నామకరణం చేయాలని బహదూర్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ కోరారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. నగరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ఫ్లైఓవర్‌ను ఏడాది పాలన విజయోత్సవాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే జూ పార్కుకు నెహ్రూ పేరు పెట్టడం జరిగిందని..దీనికి తోడు ఇక్కడి నుంచి మొదలవుతున్న ఫ్లైఓవర్‌కు కూడా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


పదోన్నతులు పొందిన ఉద్యోగులతో కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్.రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖలో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం కృషి చేసిన టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు ఎం.జగదీష్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ముజీబ్ హుస్సేనిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన ఉద్యోగులు టీఎన్జీఓస్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ పాఠశాల విభాగం కార్యదర్శి ఎం.భాస్కర్, జాయింట్ సెక్రెటరి జయంతి రెడ్డి, ప్రియదేవ్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో రామ్‌చరణ్‌కు గోల్డ్‌మెడల్



అబిడ్స్: ఓపెన్ బాక్సింగ్–2024 తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీల్లో 8వ తరగతి విద్యార్థి రామ్‌చరణ్ గోల్డ్‌మెడల్ సాధించి ప్రతిభ కనబరిచాడు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఓపెన్ బాక్సింగ్ పోటీల్లో గుడిమల్కాపూర్ న్యూజెన్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఎం.రామ్‌చరణ్ గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ రామ్‌చరణ్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యార్థులను విద్యతో పాటు క్రీడలు, ఇతర అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.